## క్లుప్తంగా

### అమ్మవారి సన్నిధిలో కలెక్టర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో దుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన కలెక్టర్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో కెఎస్.రామారావు దంపతులు కలెక్టర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఏఎఈవో చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### లడ్డూ పోటు, అన్నప్రసాదాల్లో తనిఖీలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భవానీలు, భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాలను అందజేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని దుర్గగుడి ఈవో కేఎస్.రామారావు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. దేవస్థాన ప్రధాన లడ్డూ పోటు, అర్జున వీధిలోని దేవస్థాన షెడ్డులోని లడ్డూ పోటులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా లడ్డూలను తూకం వేసి పరిశీలించారు. లడ్డూ నాణ్యత, తూకం సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని క్యూలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులతో మాట్లాడారు. తాగునీరు, ఇతర సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

### భక్తులకు అన్నప్రసాద వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య ధర్మసత్రం దగ్గర మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. లయన్స్ క్లబ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యంలో క్లబ్ రిలీవింగ్ హంగర్ కార్యక్రమ రికగ్నైజ్డ్ డీసీ అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లబ్ పూర్వ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీసాయి పూర్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత గోపీకృష్ణ, అన్నే సాంబశివరావు పాల్గొని అన్నప్రసాద వితరణను ప్రారంభింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దసరా ఉత్సవాల పది రోజుల పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఆలమూరి అమరనాథ్, మద్దినేని చక్రధర్, విశ్వేశ్వరరావు, సుప్రీమ్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి లాజరస్ కుమార్, కోశాధికారి నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

### వన్‌టౌన్ పీఎస్‌లో ఆయుధ పూజ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మను వేడుకుంటూ వన్‌టౌన్ పోలీసులు సోమవారం ఆయుధ పూజ చేశారు. దసరా మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి చిత్రపటాలను ఉంచి శాస్త్రోక్తంగా పూజాదికాలను నిర్వహించారు. బ్రిటీష్ కాలం నుంచి అప్పటి ఠానేదార్‌గా వ్యవహరించే పోలీసులు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ప్రస్తుత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న ఇన్‌స్పెక్టర్ రావి సురేష్‌రెడ్డి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ముందు ఆయుధాలను ఉంచి పూజాదికాలను నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిబ్బంది, కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి నైవేద్యాలను ప్రసాదంగా స్వీకరించారు.



# దారులన్నీ.. అమ్మ చెంతకే

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. దసరా ఉత్సవాలు ముగిసినప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి భవానీలు పెద్ద సంఖ్యలో అమ్మవారి సన్నిధికి తరలివస్తున్నారు. అమ్మ వారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. దీంతో మంగళవారం ఆలయ పరిసరాలు భవానీలతో కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



















## భక్తిశ్రద్ధలతో సాయిబాబా పుణ్యతిథి

భవానీపురం(విజయవాడపశ్చిమ): షిర్డీ సాయిబాబా పుణ్యతిథి, మహాసమాధి మహోత్సవాన్ని బాబా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవానీపురం పాత హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం నిర్వహించిన సాయిబాబా సమాధి ఉత్సవంలో భాగంగా మందిర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి ప్రతిమ వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమాన్ని మందిర పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీఎల్ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు కె.యదునందనరాజు, జీవీ కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పర్యవేక్షించారు. బూర్లె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దసర శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. అలాగే బాబావారి పుణ్యతిథి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశామని చెప్పారు.

## బాలాజీ హాస్పిటల్స్, డయాబెటిస్ సెంటర్ ప్రారంభం



వైద్య సౌకర్యాలను ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మికి వివరిస్తున్న డాక్టర్ ఫణికుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక స్వాతి థియేటర్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన బాలాజీ హాస్పిటల్స్ అండ్ డయాబెటిస్ సెంటర్‌ను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఈ హాస్పటల్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. హాస్పిటల్ నిర్వాహకులు, ప్రముఖ డయాబెటిక్ వైద్యులు డాక్టర్ ఆర్ఎల్‌వీ ఫణికుమార్, డాక్టర్ డి.అనూష మాట్లాడుతూ గతంలో కన్నా మరిన్ని వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో నూతన భవనంలోకి హాస్పిటల్‌ను మార్చామన్నారు. ఇక్కడ అత్యాధునిక ల్యాబ్ సౌకర్యంతో సుశిక్షితులైన వైద్య సిబ్బందితో 50 పడకలతో హాస్పిటల్‌ను తీర్చిదిద్దామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగరాల అన్నదాన సత్రం భవన నిర్మాణ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరాల అన్నదాన సత్రం భవన నిర్మాణ అభివృద్ధి కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పోతిన వెంకటరావు(సుమన్), అధ్యక్షులుగా పోతిన వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యక్షులుగా లింగిపల్లి అప్పారావు, గుజ్జారి లలిత తదితరులతో 22 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. శ్రీశైలంలో నిర్మిస్తున్న నగరాల నిత్యాన్నదాన సత్రం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను కొత్తపేటలోని కొరగంజి ఎన్‌క్లేవ్‌లో ఉన్న అన్నదాన వసతి సత్రం కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆవిష్కరిస్తామని ఆ వసతి సత్రం అధ్యక్షుడు నల్లాన సూర్యారావు, ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్నాథరావు, భవన నిర్మాణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతిన వెంకటేశ్వరస్వామి చెప్పారు. కమిటీ నాయకులు లింగిపిల్లి అప్పారావు, బంక హనుమంతరావు, లింగిపిల్లి రామకృష్ణ, పోతిన వరప్రకాష్, బాయన శేఖర్ బాబు, పిళ్లా విజయకుమార్ పాల్గొన్నారు.

# ముగిసిన శత చండీయాగం



వేద పండితులకు సత్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన శ్రీ రుద్ర సహిత అష్టోత్తర శత చండీయాగం సోమవారంతో ముగిసింది. తొమ్మిది రోజుల పాటు లోకసంక్షేమాన్ని కాంక్షిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శతచండీయాగం పూర్ణాహుతితో ముగించారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో చేపట్టిన శత చండీయాగం కార్యక్రమం వైభవంగా ముగించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిదంపతుల శాంతి కల్యాణంలోని పరమార్థాన్ని పండితులు కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు వివరిస్తూ జరిపించారు. వెయ్యి మంది మహిళలతో సుహాసిని పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీహోమం చేశారు. రుద్ర, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా కొనసాగించారు. సోమవారం వేద సభను నిర్వహించి, వేద పండితులను సత్కరించారు. ఉదయం కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావులు పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 56 మంది చండీయాగంలో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి వారి దేవస్థానంలోనూ వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో వైద్య సేవలు



భక్తులకు మందులు అందజేస్తున్న దేవతి నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రి దిగువున ఉన్న కనకదుర్గనగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలు సేవలు అందించారు. తొమ్మిది రోజుల పాటు కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు బీపీ, షుగర్ వంటి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా క్లబ్ సీనియర్ సభ్యుడు, కార్యక్రమ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 25 వేల మంది యాత్రికులు వైద్య సేవలు పొందారన్నారు. క్లబ్ సభ్యులు, వివిధ ఫార్మా కంపెనీల సౌజన్యంతో సుమారు రూ.4 లక్షల విలువైన మందులను పంపిణీ చేశామని, ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ కోలా విజయశేఖర్ ఆధ్వర్యంలో సీపీఆర్ ఎలా చేయాలో నేర్పించారన్నారు. క్లబ్ సభ్యుడు కె.కేశవరావు సౌజన్యంతో ప్రతి రోజూ ప్రసాద వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీవీ నారాయణరావు, కోశాధికారి జి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి మహేష్, కోట సుబ్బారావు, పి.వేణుగోపాల్, జి.సుబ్రహ్మణ్యం, జి.ఉమాశంకర్, ఐ.సురేష్‌బాబు, వినయ్, అనుదీప్, రాము ప్రసాద్ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందజేశారని చెప్పారు.

### బహిరంగ ప్రకటనకు ఖండన నోటీసు

మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామ కాపురస్తుడు 01.తోట వెంకటరావు గారి కుమారుడు హరిబాబు మరియు 02.హరిబాబు గారి భార్య కృష్ణవేణి గార్ల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది

మా క్లయింట్లు లోగా ది.23.12.2022 మరియు ది.25.09.2023 తేదీలలో ''సాక్షి'' దినపత్రికలో ప్రచురింపజేసియున్న ''బహిరంగ ప్రకటన'' యందు ఉదహరించిన విషయములు ఖండిస్తూ కృష్ణాజిల్లా విజయవాడ సిటీ, విద్యాధరపురం కాపురస్తుడు పైడి అప్పలస్వామి గారి కుమారుడు గోవిందరావు గారు ది.06.10.2023 తేదీన ''ఈనాడు'' దినపత్రికలో ప్రచురణ చేయించిన ప్రకటన విషయములు వాస్తవ విరుద్ధములై యున్నవి.

సదరు ''ప్రకటన'' లో ఉదహరించిన షెడ్యూలు ఆస్తుల విషయమై మా క్లయింటు హరిబాబు ఏ విధమైన అగ్రిమెంట్లు వ్రాయించి యుండలేదు. దావాలలో మా క్లయింటు తన ప్రతివాదనలు దాఖలు చేసియున్నాడు. ది.25.09.2023 తేదీన మా క్లయింట్లు ప్రచురణ చేయించిన ''బహిరంగ ప్రకటన'' లో వివరించిన పైడి గోవిందరావు అతని అనుచరులైన విజయవాడ వాస్తవ్యులు 01.పైడి ఫణి, 02.బంగా రంగా, 03.లంకలపల్లి ఉదయ కుమార్, 04.దేవ అప్పలరాజు, 05.ఆకిరి శ్రీను, 06.నరైష్ట శంకరరావు, 07.కొమ్మూరి గిరిబాబు మరియు 08.దాడి శెట్టి సుదాబీ అను వారలపై మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో ప్రైవేటు కంప్లయింటు దాఖలు చేయగా కోర్టువారు విచారణ నిమిత్తం తాడేపల్లి పోలీసుస్టేషనుకు రిఫర్ చేయగా దరిమిలా సదరు పోలీసు వారుపై వారందరిపై ది.16.09.2023 తేదీన క్రైమ్ నెం.805/2023 రు గా కేసు రిజిష్టరు చేసియున్నారు.

పై పరిస్థితులలో వాస్తవములను మరుగుపరచి మా క్లయింటుల గౌరవ మర్యాదలకు భంగము కలిగించుటకు తద్వారా ఒత్తిడి తెచ్చి మా క్లయింట్లు వద్ద నుండి అక్రమముగా లబ్ధిపొందుటకు గాను పైడి గోవిందరావు సదరు ''ప్రకటన'' ప్రచురణ చేయించి యున్నారని సదరు ప్రకటనలో షెడ్యూలు ఆస్తుల విషయమై వ్రాయించిన విషయములు వాస్తవ విరుద్ధమైనవనిన్ని ఈ ''ఖండన నోటీసు'' ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

మంగళగిరి, తేది:24.10.2023

బంకా శివరామ్‌ప్రసాద్, బంకా వంశీకృష్ణ, గద్దె రవికిరణ్ అడ్వకేట్స్, మంగళగిరి

# ముగిసిన దసరా మహోత్సవాలు

నియోజకవర్గంలోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. అమ్మవార్లు సోమవారం ఉదయం మహిషాసురమర్దనీదేవిగా, సాయంత్రం రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. అనంతరం నగరోత్సవాలు కనులపండువగా నిర్వహించారు.

– వన్‌టౌన్(విజయవాడపశ్చిమ) / చిట్టినగర్(విజయవాడపశ్చిమ)




కొత్తగుళ్లు ప్రాంగణంలో కోదండరాముడు



మహిషాసురమర్దనీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



విజయలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు



పాండురంగస్వామి సన్నిధిలో శమీపూజ



కొత్తపేటలో పూర్ణాహుతి గావిస్తున్న అర్చకులు



భీమనవారిపేటలో రాజరాజేశ్వరీదేవి



కరకట్ట వద్ద రాజరాజేశ్వరీదేవిగా దుర్గాదేవి



రాజరాజేశ్వరీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు



కాళికాదేవిగా లలితాంబికా అమ్మవారు



చదును మహాలక్ష్మీ అమ్మవారు

● గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని రామమోహన గ్రంథాలయంలో చేపట్టిన మరమ్మతులలో భాగంగా పునర్ నిర్మించిన సమావేశ మందిరాన్ని మంగళవారం గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు ప్రారంభించారు. దసరా సందర్భంగా గ్రంథాలయంలో ఆయుధ పూజ చేశారు. 100 సీటింగ్ కెపాసిటీతో సమావేశ మందిరాన్ని నిర్మించినట్లు చెప్పారు.